సాక్షి అనకాపల్లి

మంగళవారం । 27 । జూన్ । 2023



రామునిగా జగన్నాథస్వామి

అనకాపల్లిటౌన్: స్థానిక గూడ్స్‌రోడ్డు వద్ద ఇంద్రద్యుమ్నహాల్లో జగన్నాథస్వామి రామావతారంలో దర్శనమిచ్చారు.



ప్రతి సమస్యకు పరిష్కారం

'జగనన్నకు చెబుదాం' లో వచ్చిన సమస్యలను జగనన్న సురక్ష కార్యక్రమంలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. 8లో



'సిరి' సిత్రాలు చూడరో..

తృణధాన్యాలతో ప్రముఖుల చిత్రాలను తీర్చిదిద్దుతున్నారు విశాఖకు చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్. 8లో

న్యూస్‌రీల్

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి



ఒంపోలు అంగన్‌వాడీ కేంద్రంలో క్రీడాసామగ్రిని పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

మునగపాక: మండలంలోని గణపర్తి, ఒంపోలు గ్రామాల్లో సోమవారం అసిస్టెంట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి దత్తత గ్రామమైన గణపర్తిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ప్రజా సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఒంపోలు అంగన్‌వాడీ కేంద్రానికి మంజూరైన క్రీడాసామగ్రిని ఆమె పరిశీలించారు. కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భిణులు,పిల్లలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. ఎంపీడీవో మన్మధరావు,తహసీల్దార్ పి.ప్రకాశరావు,ఈవోఆర్డీ ఈశ్వరరావు,డీటీ వినయ్‌కుమార్, సర్పంచ్‌లు చదరం నాయుడు, సూరిబాబు,వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బొద్దపు శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

30న ఆర్టీసీ స్థలాల లీజుపై అవగాహన సదస్సు

అనకాపల్లిటౌన్ : జిల్లాలో ప్రజా రవాణా వ్యవస్థ(ఆర్టీసీ) ఖాళీ స్థలాల్లో లీజు ప్రాతిపదికన వ్యాపారం చేసుకునేందుకు ఓఎస్-15 పద్ధతిలో కేటాయించనున్నట్టు సంస్థ జిల్లా అధికారి కె.పద్మావతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనిపై వ్యాపారస్తులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 30న అనకాపల్లి డిపో ఆవరణలో ఉదయం 11 గంటలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నర్సీపట్నం బస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న 7,550 చ.గ., చోడవరం బస్‌స్టేషన్‌లో 6,292 చ.గ.ల ప్రభుత్వ స్థలం లీజుకు ఇవ్వనున్నట్టు వెల్లడించారు. వ్యాపారులు, ఆసక్తిగల వారెవరైనా అవగాహన సదస్సులో పాల్గొని, సందేహ నివృత్తి చేసుకోవాల్సిందిగా కోరారు.

ఉపమాక వెంకన్న ఆలయానికి రూ.లక్ష విరాళం



కామేశ్వరి బంధువుకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న అధికారులు

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి ఒక భక్తురాలు రూ.లక్ష విరాళం అందజేశారు. కాకినాడ జిల్లా పత్తిపాడుకు చెందిన గ్రంధికామేశ్వరి తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఈ సొమ్మును తన బంధువు ద్వారా దేవస్థానం అధికారులకు అందజేశారు. ఈసందర్భంగా దేవస్థానం అధికారులు రశీదు, చిత్రపటాన్ని అందజేసి, స్వామివారి దర్శనం కల్పించారు. ఈకార్యక్రమంలో ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ గోపాలాచార్యులు, నక్కపల్లికి చెందిన నున్న సురేష్‌లు పాల్గొన్నారు.

బెంగళూరు వీక్లీ స్పెషల్ పొడిగింపు

తాటిచెట్లపాలెం(విశాఖ): విశాఖపట్నం-బెంగళూరు-విశాఖపట్నం మధ్య నడుస్తున్న వీక్లీ స్పెషల్ మరి కొంతకాలం పొడిగిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. విశాఖలో ప్రతీ ఆదివారం బయల్దేరే విశాఖపట్నం-బెంగుళూరు(08543) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ జూలై 2వ తేదీ నుంచి 30వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో ప్రతీ సోమవారం బెంగళూరులో బయల్దేరే బెంగళూరు -విశాఖపట్నం (08544) వీక్లీ స్పెషల్ జూలై 3వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు.

నేడు సింహగిరిపై వరద పాయసం సేవ

సింహాచలం: సింహగిరిపై ఉన్న వైకుంఠవాసుడి మెట్టపై మంగళవారం వరదపాయసం సేవ నిర్వహించనున్నారు. వర్షాలు కురవాలని, ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని, పంటలు బాగా పండాలని వైకుంఠవాసుడి సన్నిధిలో వరదపాయసం సేవ నిర్వహించడం పూర్వకాలం నుంచి వస్తోంది. దీనిలో భాగంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి వరదపాయసం సేవ నిర్వహించనున్నారు. ఉదయం స్వామి సన్నిధిలో విశేష పూజలు, పంచకలశ స్నపనం నిర్వహిస్తారు. స్వామి సన్నిధిలోనే పాయసం వండి ఆరగింపు చేస్తారు. అనంతరం జారుడుబల్ల ఆకారంలో ఉండే కొండపై నుంచి పాయసాన్ని జారవిడుస్తారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా అనకాపల్లి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ

- కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి
- అనకాపల్లిలో భారీ ర్యాలీ, మానవహారం



నెహ్రూచౌక్‌లో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

అనకాపల్లిటౌన్: డ్రగ్స్ రహిత జిల్లాగా అనకాపల్లిని మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామ స్థాయి నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి, ఎస్పీ కె.వి.మురళీకృష్ణలు సోమవారం స్థానిక రింగ్‌రోడ్డు వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైన మాదకద్రవ్యాల రవాణా, వినియోగం జరిగితే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని కోరారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణకు గ్రామ మహిళా సంరక్ష కార్యదర్శుల(సచివాలయ పోలీసులు) పరిధిలో కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్పీ కె.వి.మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని గంజాయి రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, తనిఖీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 2020 సంవత్సరం నుంచి ఇప్పటి వరకూ 961 కేసులు నమోదు చేసి, 2,354 మంది నిందితులను అరెస్టు చేసినట్టు తెలిపారు. 98,919 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని 626 వాహనాలను సీజ్ చేసినట్టు చెప్పారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ పాఠశాలలు, కాలేజీలు, ఇతర విద్యాసంస్థల్లో 136 యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 138 పెద్ద హోర్డింగులు, బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేశామన్నారు. వారంరోజుల పాటు గ్రామ, మండల, డివిజన్ పరిధిలో పాఠశాలలు, కాలేజీల విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు ఎస్పీ చెప్పారు. అనంతరం రింగ్‌రోడ్డు జంక్షన్ నుంచి నెహ్రూచౌక్ వరకూ నిర్వహించిన ర్యాలీలో వద్దు వద్దు డ్రగ్స్ వద్దు.. ,యువత మేలుకో.. డ్రగ్స్ నుంచి తేరుకో అంటూ విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నెహ్రూచౌక్‌లో విద్యార్థులు, పోలీసులు మానవహారంగా ఏర్పడి, డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ(పరిపాలన) బి.విజయభాస్కర్, జిల్లా క్రైం ఎస్పీ పి.సత్యనారాయణ రావు, డీఎంహెచ్‌వో ఎ.హేమంత్, జెడ్పీ ఎస్.వెంకటరమణ, డీఎస్పీ వి.సుబ్బరాజు, సీఐలు దాడి మోహనరావు, టి.శ్రీను, టి.లక్ష్మీ, చంద్రశేఖర్, అప్పలనాయుడు, పైడపు నాయుడు, ఎస్‌ఐలు, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో యువత భవిష్యత్తు నాశనం

నర్సీపట్నం: మత్తుపదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని నర్సీపట్నం ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. మాదకద్రవ్యాల దుష్ఫలితాలపై అవగాహన కల్పిస్తూ పట్టణంలో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. అబీద్‌సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి మత్తుపదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. డ్రగ్స్ వినియోగం, విక్రయాలకు వ్యతిరేకంగా విద్యార్థులు, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ ఎన్.గణేష్, ఎస్‌ఐలు గోవిందరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

28న సీఎం ట్రాన్సిట్ హాల్ట్



మహారాణిపేట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 28న విశాఖ వస్తున్నారు. ఉదయం 8.30 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి ఉదయం 9.15 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. ఇక్కడ నుంచి ఉదయం 9.25 గంటలకు హెలికాప్టర్‌లో పార్వతీపురం మన్యం జిల్లాకు వెళ్తారు. అక్కడ జరగనున్న అమ్మఒడి నాలుగో విడత నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొని మధ్యాహ్నం 1.35 గంటలకు తిరిగి విశాఖ చేరుకుంటారు. 1.45 గంటలకు ప్రత్యేక విమానంలో తిరిగి విజయవాడ గన్నవరం వెళ్తారు.

నిలదొక్కుకునే'లా'..



చెక్కును అందజేస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి

- యువ న్యాయవాదులకు చేదోడు
- వైఎస్సార్ 'లా' నేస్తం నిధుల విడుదల
- జిల్లాలో 77 మందికి లబ్ధి

తుమ్మపాల: కొత్తగా లా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువ న్యాయవాదులు వృత్తిలో నిలదొక్కుకునేందుకు వీలుగా వైఎస్సార్ లా నేస్తం ద్వారా ప్రభుత్వం మూడేళ్లపాటు ఆర్థికసాయం చేస్తోందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి 2023-24 సంవత్సరానికి మొదటి విడత 'వైఎస్సార్ లా నేస్తం' ఆర్థిక ప్రోత్సాహకాన్ని బటన్ నొక్కి విడుదల చేశారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, యువ న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులైన యువ లాయర్లకు కలెక్టర్ చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ న్యాయవాదులకు నెలకు రూ.5వేలు చొప్పున జిల్లాలో మొత్తం 63 మందికి డిసెంబర్ 2019 నుంచి మే 2023 వరకు వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసినట్టు చెప్పారు. ఈ ఏడాది కొత్తగా 14 మంది జూనియర్ న్యాయవాదులకు నిధులు జమచేసినట్టు తెలిపారు. జిల్లాలో 77 మందికి నెలకు 5,000 చొప్పున రూ.3.85 లక్షలు విడుదల చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, డీఆర్డీ పీడీ లక్ష్మీపతి, యువలాయర్లు పాల్గొన్నారు.

ప్రతి పల్లెకు రహదారి సౌకర్యం

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు

మాడుగుల రూరల్: మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పిస్తామని, దీనిలో భాగంగా ప్రతి పల్లెను అనుసంధానం చేస్తూ రోడ్లు నిర్మిస్తున్నామని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. మండలంలోని ముకుందపురం ప్రధాన రహదారి నుంచి వంటర్లపాలెం పోవు రహదారిని ఆయన సోమవారం ప్రారంభించారు. రూ.74 లక్షలతో రెండు కిలోమీటర్ల మేర ఈ రహదారి నిర్మించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంటర్లపాలెం, ఇతర గ్రామాల ప్రజలకు ఈ రహదారి పూర్తితో ప్రయాణ సౌకర్యం మెరుగుపడుతుందన్నారు. అనంతరం వంటర్లపాలెంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటరును ప్రారంభించారు. దీన్ని రూ.17.50 లక్షలతో నిర్మించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, కొత్తపల్లి శ్రీనివాస్, వంటర్లపాలెం సర్పంచ్ అల్లాడ నాగేశ్వరావు, ఎంపీటీసీ సభ్యురాలు దండి నాగరత్నం, ముకుందపురం సర్పంచ్ కర్రి గణేశ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు చోడవరం విద్యార్థులు



రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన చోడవరం విద్యార్థులు

చోడవరం: జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో చోడవరం క్రీడాకారులు పతకాలు సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తైక్వాండో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లం మురళి సోమవారం తెలిపారు. ఈనెల 25న అనకాపల్లిలో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో, పూమ్‌సే పోటీల్లో చోడవరం ప్రాంత క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో 21 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో బంగారు, రజతం, కాంస్య పతకాలు సాధించారని మురళి తెలిపారు. శారద, కొల్లిపార తన్విత్ ఉదయ్, కె.రోహిత్, వి.జషికరోజిలి, ఎం.హేమశ్రీ, డి.ఎస్.ఎస్.అంజనిప్రియ, పి.తనహా, బొబ్బిలి సత్యరామచంద్ర, పి.ఎస్.ఎస్.తరుష్, ఆకుల ముఖేష్, డి.కృష్ణవేణి, జి.వి.శశివర్ధన్, కొసిరెడ్డి లావణ్య, లంకపల్లి గిరీష్, జి.గిరిశంకర్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు మురళి తెలిపారు. వీరందరినీ స్థానికులు అభినందించారు.

పక్కాగా ఓటర్ల జాబితా



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి, తహసీల్దార్ అమ్మాజీ

యలమంచిలి: ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించాలని యలమంచిలి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌వోబీ) జ్ఞానవేణి అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది,రెవెన్యూ అధికారులతో ఓటర్ల జాబితాపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు తప్పని సరిగా ఓటర్లుగా నమోదు కావాలన్నారు. చనిపోయిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారిని ఓటర్లుగా చేర్పించాలని సూచించారు. ఓటు హక్కు నమోదుపై పట్టణంలో కళాశాలల విద్యార్థులకు కళాశాలల యాజమాన్యాల ద్వారా అవగాహన కల్పించాలని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ రాణి అమ్మాజీ, వీఆర్వోలు,బీఎల్‌వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీకి హ్యాపీ సమ్మర్!

- వేసవిలో పెరిగిన ఆక్యుపెన్సీ
- 67 శాతానికి పైగా ఓఆర్ నమోదు
- విశాఖ రీజియన్‌కు రూ.83.50 కోట్ల ఆదాయం
- ఈసారి ఏసీ సర్వీసులకు ఎనలేని డిమాండ్



సాక్షి, విశాఖపట్నం: ఈ వేసవి మలమల మాడించింది. తీవ్ర వడగాడ్పులతో దడ పుట్టించింది. అయితే ఆర్టీసీకి మాత్రం ఆనందాన్నిచ్చింది. ఆశించిన స్థాయికంటే అధిక ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. సాధారణంగా ఎండాకాలంలో పెళ్లిళ్లు, ఇతర శుభ ముహూర్తాలు ఎక్కువగా ఉంటాయి. అలాగే పాఠశాలలు, కాలేజీలు, యూనివర్సిటీలు వంటి విద్యాసంస్థలకు వేసవి సెలవులు ఇవ్వడంతో కుటుంబ సభ్యులతో కలిసి ఇతర ప్రాంతాలకు, విహార యాత్రలకు వెళ్తుంటారు. వీటన్నిటితో బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య ఇతర రోజుల్లోకంటే వేసవిలో అధికంగా ఉంటుంది. అందుకనుగుణంగానే ఈ సీజనులోనూ ప్రయాణికుల తాకిడి బాగుంది. ఆర్టీసీ విశాఖ జిల్లాలో ఏప్రిల్‌కు ముందు బస్సుల్లో ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) 55 శాతం వరకు ఉండేది. ఏప్రిల్ నుంచి ఓఆర్ పెరుగుతూ వచ్చింది. ఏప్రిల్‌లో 55 శాతం, మేలో 67, జూన్‌లో (26వ తేదీ వరకు) 68 శాతం చొప్పున ఓఆర్ నమోదైంది. మరోవైపు సాధారణ నాన్-ఏసీ బస్సులకంటే ఏసీ సర్వీసుల్లో ఓఆర్ మరింత అధికంగా ఉంది. 40-45 డిగ్రీల ఉష్ణోగ్రతల వేసవి తాపం, తీవ్ర వడగాడ్పులకు తాళలేక దూరప్రాంతాలకు వెళ్లే పలువురు ప్రయాణికులు ఏసీ బస్సుల్లో ప్రయాణానికి బాగా మొగ్గు చూపారు. దీంతో ఈ బస్సుల్లో 83 శాతం వరకు ఆక్యుపెన్సీ రేషియో నమోదైంది. ఏప్రిల్‌లో నెలలో ఇది 50 శాతానికి మించలేదు. ఇలా ఓఆర్‌తో పాటు ఆర్టీసీకి రాబడి కూడా పెరిగింది. విశాఖపట్నం నుంచి వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ రోజుకు 30 ఏసీ బస్సులను నడుపుతోంది. వీటిలో హైదరాబాద్‌కు ఆరు, కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళంలకు 16, విజయవాడ, కడప, అమలాపురంలకు ఎనిమిది బస్సుల చొప్పున నడుస్తున్నాయి. ఇవన్నీ 80 శాతానికి పైగా ఓఆర్ సాధించాయి. ఏప్రిల్ నెలలో రూ.25.50 కోట్లు, మే నెల రూ.32 కోట్లు, జూన్‌లో ఇప్పటివరకు రూ.26 కోట్లు వెరసి ఈ వేసవి మూడు నెలల్లో రూ.83.50 కోట్ల ఆదాయం సమకూరింది. ఇది ఆర్టీసీకి ఊరటనిచ్చే అంశమని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు.

17 వేల ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరు

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



రైతులు,అధికార్లతో సమీక్షలో మాట్లాడుతున్న ధర్మశ్రీ

రావికమతం: పెద్దేరు రిజర్వాయర్ కుడి ప్రధాన కాలువ ద్వారా 17 వేల ఎకరాలకు పూర్తి స్థాయిలో సాగునీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. పెద్దేరు రిజర్వాయర్ ఆధునికీకరణ పనులకు ప్రభుత్వం ఇప్పటికే రూ.84.44 కోట్లు మంజూరు చేసిందని, ప్రధాన కాలువతో పాటు పిల్లకాలువల లైనింగ్ చేపడతామని చెప్పారు. గుమ్మాళ్లపాడులో సర్పంచ్ బంటు సన్యాసినాయుడు అధ్యక్షతన రైతులు, ఇరిగేషన్ డీఈ చిన్నంనాయుడు,పలువురు జేఈలతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుడి ప్రధాన కాలువ ద్వారా ఆయకట్టుకు ఇప్పటికీ పూర్తి స్థాయిలో నీరందించలేకపోతున్నందున కాలువల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. ఈ నిధులతో లైనింగ్ చేపట్టి అవసరమైన చోట మదుములు,తూములు,అక్విడెక్ట్‌లు నిర్మిస్తారన్నారు. దీని వల్ల నీరు వృథాకాకుండా నేరుగా ఆయకట్టు భూములకు చేరుతుందని చెప్పారు. త్వరలోనే అధికార్లు పనులు చేపడతారన్నారు.

కేఎం చానల్ సమస్య పరిష్కరిస్తాం

కేఎం చానల్ సమస్యను కూడా పరిష్కరిస్తామని ధర్మశ్రీ చెప్పారు. రిజర్వాయర్ పరిధిలో గతంలో కాలువ నిర్మించినప్పటికీ కొమిర,మత్స్యపురం భూములకు నీరుపారడం లేదన్నారు. ఈ సమస్య పరిష్కరించాలని రైతులు 15 ఏళ్లుగా కోరుతున్నారని చెప్పారు. ఈ సమస్యను కూడా ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైలరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు,మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ జరిగి తీరుతుంది

- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: స్థానిక మెయిన్ రోడ్డు విస్తరణ జరిగి తీరుతుందని..బ్రోకర్ల మాటలు నమ్మవద్దని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. రోడ్డు విస్తరణపై సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొందరు బ్రోకర్లు రోడ్డు విస్తరణపై చేస్తున్న ప్రకటనలు నమ్మవద్దన్నారు. మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం మేరకు మెయిన్ రోడ్డును వంద అడుగులకు విస్తరిస్తామన్నారు. వారం రోజుల్లో విస్తరణ పనులు మొదలు పెడతామని చెప్పారు. మెయిన్ రోడ్డు విస్తరణకు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా శంకుస్థాపన చేశారన్నారు. నర్సీపట్నం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కలిసి రావాలని కోరారు. అందరికీ మేలు జరగాలనే ఉద్దేశంతో వంద అడుగులకు రోడ్డు విస్తరణ చేస్తున్నామన్నారు. రోడ్డు విస్తరణతో ప్రజలకు, వ్యాపారులకు మేలు చేకూరుతుందని చెప్పారు. వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకుని భవన యజమానులు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. సమావేశంలో చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీలకు ఆహ్వానం

గోపాలపట్నం: విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో గెస్ట్ ఫ్యాకల్టీలుగా పనిచేసేందుకు అర్హులైన, ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఉమ్మడి విశాఖ జిల్లా గురుకులాల సమన్వయకర్త ఎస్.రూపావతి తెలిపారు. ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బయోలజీ, సోషల్ సబ్జెక్టుల బోధనకు గాను అభ్యర్థులు ఈ నెల 28న 9 గంటలకు కొమ్మాదిలో గల డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ గురుకుల కళాశాలలో నిర్వహించే డెమోకి హాజరుకావాలని కోరారు. టెట్ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 0891-2799641 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

వచ్చే ఏడాదికి వైద్య కళాశాల సిద్ధం

- చురుగ్గా పాడేరు వైద్య కళాశాల నిర్మాణ పనులు
- పలు బ్లాక్‌ల తనిఖీ చేసిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



మెడికల్ కళాశాల భవన నిర్మాణాల నమూనాను పరిశీలిస్తున్న మంత్రి విడదల రజిని

సాక్షి, పాడేరు: గిరిజనులకు ఉన్నత వైద్యం, విద్య లక్ష్యంతో పాడేరులో రూ.500 కోట్లతో చేపట్టిన వైద్య కళాశాలలో వచ్చే ఏడాది నుంచి తరగతులను ప్రారంభిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. మెడికల్ కళాశాల నిర్మాణ పనులను సోమవారం ఆమె పరిశీలించారు. పలు బ్లాక్‌ల భవన నిర్మాణాలను తనిఖీ చేశారు. ఆయా పనుల ప్రగతిపై అధికారులతో పాటు నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమీక్షించారు. వారికి పలు సూచనలు చేశారు. వైద్య కళాశాల నమూనాను అధికారులు మంత్రికి చూపించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వచ్చే ఏడాది పాడేరుతో పాటు మరో నాలుగు జిల్లాల్లోని వైద్య కళాశాలల్లో తరగతులు ప్రారంభిస్తామని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వైద్య కళాశాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైద్య కళాశాల నిర్మాణ ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారన్నారు. గతంలో ఉన్నత వైద్య సేవలకు విశాఖపట్నం వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. గతంలో వైద్యులు, సిబ్బంది కొరత ఉండేదని, ఇటీవల ముఖ్యమంత్రి రాష్ట్ర వ్యాప్తంగా 49 వేలకు పైగా ఖాళీలను భర్తీ చేశారన్నారు. గిరిజన ప్రాంతాలకు వైద్య నిపుణులు, ఆధునిక వసతులు అందుబాటులోకి రావడం మంచి పరిణామమన్నారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్ధారణ పరీక్ష కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. వైద్యపరీక్షలనిమిత్తం వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పరీక్షల అనంతరం ధ్రువపత్రాలు అందజేశారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. రక్తదాతలను అభినందించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, కలెక్టర్ సుమిత్‌కుమార్, జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ శోభ స్వాతిరాణి తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో చోడవరం విద్యార్థుల ప్రతిభ



జిల్లా స్థాయి యోగా పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

చోడవరం: జిల్లాస్థాయి యోగా పోటీల్లో చోడవరం విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈనెల 25న అనకాపల్లి శ్రీరామచంద్రమిషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో చోడవరం పతంజలి యోగా కేంద్రంలో శిక్షణ పొందుతున్న 11మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో పతకాలు సాధించారు. వి.హరిదుర్గ, ఎం.ధనుష్, ఎఎస్పీ. యాదవ్, పి.క్రాంతిసాగర్, వి.పూర్ణచంద్రరావు, పి.హరీష్, పందిరి వెన్నెలశ్రీ, పి.పవన్‌కుమార్, ఎం.శ్రీహిత పతకాలు గెలుచుకున్నారు. వీరిని యోగా కేంద్రం గురువు పుల్లేటి సతీష్, వాసవీక్లబ్ అధ్యక్షుడు పసుమర్తి అశోక్, భోగవిల్లి గణేష్, కొట్టాపు హరికిరణ్ తోపాటు పలువురు అభినందించారు.

6న పీడీఎస్ బియ్యం వేలం

కోటవురట్ల: మండలంలో 6ఎ కేసుల్లో సీజ్ చేసిన పీడీఎస్ బియ్యాన్ని వచ్చేనెల 6న వేలం వేయనున్నట్టు తహసీల్దారు జానకమ్మ సోమవారం తెలిపారు. వివిధ కేసుల్లో 143.22 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గతంలో సీజ్ చేసినట్టు చెప్పారు. ఈ బియ్యం ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఉన్నాయి. ఆసక్తి ఉన్న వారు పరిశీలించి, వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. వేలంలో ఏ మండలం వారైనా పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 92935 08767 నంబరులో సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

యలమంచిలి : గూండ్రుబిల్లి గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ కె.సన్నిబాబు తెలిపిన వివరాలివి. నక్కపల్లి మండలం రేబాక గ్రామానికి చెందిన సాదిరెడ్డి నాగేశ్వరావు (36) ఆదివారం ఏటికొప్పాక గ్రామంలో ఒక శుభ కార్యానికి వెళ్లి తిరిగి తన ద్విచక్రవాహనంపై పులపర్తి గ్రామం నుంచి ఎస్.రాయవరం వైపు వెళ్లుండగా గూండ్రుబిల్లి గ్రామం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన నాగేశ్వరావును బంధువులు విశాఖపట్నంలోని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. కటుంబం సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

మునగపాక : మహిళ మెడలో నుంచి రెండు తులాల తాడును బైక్‌పై గుర్తు తెలియని వ్యక్తి వచ్చి అపహరించుపోయిన సంఘటన మండల పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. మునగపాక గ్రామానికి చెందిన వరలక్ష్మి సోమవారం అనకాపల్లి వెళ్లి వస్తూ తిరుగు ప్రయాణంలో ఆటో ఎక్కింది. ఇదే సమయంలో ఓ వ్యక్తి తలకు హెల్మెట్ తగిలించుకొని బైక్‌పై ఆటోను కొంతదూరం అనుసరించాడు. , అనకాపల్లి జాతీయ రహదారి దాటాక ఆటోలో కూర్చొన్న వరలక్ష్మి మెడలోని తాడును బలవంతంగా లాగే ప్రయత్నం చేశాడు.

ఆమె ప్రతిఘటించడంతో మూడు పేటలున్న తాడుకు గాను ఒక పేట తాడు(రెండు తులాలు)ను ఎత్తుకుపోయాడు. దీంతో బాధిత మహిళ వరలక్ష్మి కన్నీటిపర్యంతమైంది. ఈ విషయమై ఎస్ఐ ఆలీని సంప్రదించగా ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ప్రతి సమస్యకు పరిష్కారం

కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కె.వి.మురళీకృష్ణ


జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి

తుమ్మపాల: జగనన్నకు చెబుదాం పథకంలో వచ్చిన సమస్యలను జగనన్న సురక్ష కార్యక్రమంలో పరిష్కరించాలని కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి ఆదేశించారు. కలెక్టరేట్ వీసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో ఆయనతో పాటు జేసీ జాహ్నవి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పరిష్కరించాలన్నారు. అందరికీ సంక్షేమ పథకాలు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వచ్చే నెలలో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. అధికంగా భూ సమస్యలు వస్తున్నాయని వాటిని పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని తెలిపారు. సోమవారం మొత్తం 259 అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత, గ్రామవార్డు సచివాలయ అధికారి మంజులావాణి, డీఆర్డీఏ పీడీ లక్ష్మీపతి, డ్వామా పీడీ సందీప్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

– తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ లిక్విడేటర్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, టీడీపీ నాయకులు కలెక్టరేట్ గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. సీసీఎల్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్న కలెక్టర్ తమ వినతిని తీసుకోవడంలో గంటల పాటు జాప్యం చేసి, వేచి ఉండేలా చేయడం తగదంటూ కలెక్టరేట్‌లో మాజీ ఎమ్మెల్యేతో పాటు నాయకులు నేలపై కూర్చుని నిరసనతో హడావుడి చేశారు. ఆర్డీవో చిన్ని కృష్ణ వారి వద్దకు వెళ్లి కలెక్టర్ వద్దకు తీసుకెళ్లారు.

బీమా నగదు ఇప్పించండి..

రెండేళ్ల క్రితం తన భర్త తర్రా ఉమామహేష్ మరణించారని, వైఎస్సార్ బీమా సొమ్ము చెల్లించాలని కోరుతూ అనకాపల్లి మండలం సంపతిపురం గ్రామానికి చెందిన తర్రా నాగమణి కలెక్టర్‌ను కోరారు. బీమా సొమ్ము సగం మాత్రమే జమ చేశారని మిగిలిన సొమ్ము చెల్లించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఎస్పీ 'స్పందన'కు 39 అర్జీలు

అనకాపల్లిటౌన్: స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 39 అర్జీలు వచ్చాయి. ఎస్పీ కె.వి.మురళీకృష్ణ.. అర్జీదారుల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చట్ట పరిధిలో ఉన్న సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామన్నారు. ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, మోసాలు వంటి వాటిపై ఎక్కువ అర్జీలు వచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ(పరిపాలన) బి.విజయభాస్కర్, క్రైం ఎస్పీ సత్యనారాయణరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్ఐ చక్రధర్ పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 50 మంది ఎంపిక

పాయకరావుపేట: స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో వసుధ ఫార్మా కెమికల్ లిమిటెడ్ కంపెనీ (హైదరాబాద్) ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు సోమవారం నిర్వహించారు. ఈ క్యాంపస్ ఇంటర్వ్యూలకు విశాఖ, అనకాపల్లి, కాకినాడ జిల్లాలకు చెందిన వివిధ కళాశాలల నుంచి ఫైనలియర్ బీఎస్సీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చదువుతున్న, పూర్తయిన విద్యార్థులు సుమారు 150 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరికి సంస్థ డిప్యూటీ మేనేజర్, హెచ్ఆర్ పి.హర్షవర్మ అవగాహన కల్పించారు. సంస్థకు సంబంధించిన పద్ధతులను, నియమాలను తెలియజేస్తూ, ఎంపిక ప్రక్రియ వివరించారు. సుమారు 50 మంది విద్యార్థులు వసుధ ఫార్మా కెమికల్ లిమిటెడ్ కంపెనీలో క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ అనాలసిస్, ప్రొడక్షన్ విభాగాల్లో పనిచేయుటకు అర్హత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వీర్రాజు తెలిపారు. ఎంపికైన వారిని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సిహెచ్.వి.కె. నరసింహారావు, సహాయ కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ అభినందించారు. కార్యక్రమంలో మేనేజర్ వి.శ్రీరామమూర్తి, టి.గణేష్ పుత్ర కుమార్, మేనేజర్ ఎం.ప్రకాష్, అసిస్టెంట్ మేనేజర్ డి.వర్మరాజు, సీనియర్ మేనేజర్ పి.లక్ష్మీనారాయణ, జూనియర్ మేనేజర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పెనుగ్గొ సుబ్బారావు పాల్గొన్నారు.


క్యాంపస్ ఇంటర్వ్యూలకు ఎంపికైన విద్యార్థులు

అయ్యన్నా.. ఆనాడు మంత్రిగా ఏం చేశావ్?

- మీ ప్రభుత్వంలోనే గ్రానైట్ లోడు లారీలతో రోడ్లు శిథిలం
- ఇప్పుడు గంధవరం – వెలంకాయ పాలెం పనులపై విమర్శలా..
- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ధ్వజం



రావికమతం: ప్రజా స్పందన కరువైన తుస్సు యాత్ర పేరుతో అవాకులు చవాకులు పేల్తున్న తాగుబోతు అయ్యన్నా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం రావికమతం వచ్చిన ఆయన సాక్షితో మాట్లాడారు. అభివృద్ధితో పాటే పేదల, బడుగు బలహీన వర్గాలకు మేలు చేస్తూ సంక్షేమ ఫలాలు ఇంటింటికీ అందించడంలో దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా పేరుతెచ్చుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కాలి గోటికి సరిపోవని, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకపోతే వచ్చే ఎన్నికల్లోనూ తుక్కుగా ప్రజలు ఓడిస్తారన్నారు. ఆనాడు మంత్రి హోదాలో నర్సీపట్నం–భీమునిపట్నం రోడ్డును రూ.300 కోట్లతో తుని నుంచి సబ్బవరం వరకూ అభివృద్ధి చేస్తామని, మరోసారి రూ.600 కోట్లుతోనూ, ఇంకోసారి రూ.వెయ్యి కోట్లుతో సీలేరు నుంచి సబ్బవరం వరకూ వేస్తామని ప్రగల్భాలు పలికి ఏం చేశావని దుయ్యబట్టారు. రోడ్డు వేయలేదు సరికదా రావికమతం మండలంలో కల్యాణపులోవ, కవగుంట, దొండపూడి, గుడ్డిప, తోటకూరపాలెం, టి.అర్జాపురం, కొట్నాబిల్లి, గదబపాలెం గ్రామాల వద్ద 15 వరకూ గ్రానైట్ క్వారీలు ఏర్పాటు చేశారని ఆరోపించారు. కమీషన్లు మెక్కి భారీ లోడ్‌లతో ట్రాలీలు వెళ్తున్నా, గిరిజనులు, గ్రామస్తులు ఆందోళనలు చేసినా కనీసం పట్టించుకోలేదన్నారు. ఆ పాపమే ఇప్పటికీ వెంటాడుతోందని విమర్శించారు. తాను చిత్తశుద్ధితో సీఎం దృష్టికి ఈ రోడ్ల సమస్యను తీసుకెళ్లానన్నారు. రూ.120 కోట్లతో వెలంకాయపాలెం నుంచి గంధవరం వరకు బీఎస్ రోడ్డును విస్తరించే పనులు చేస్తుంటే విమర్శించడం సిగ్గు చేటన్నారు.

డిసెంబరు కల్లా ఈ పనులన్నీ పూర్తిచేసి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. దీంతోపాటు రూ.1.16 కోట్లతో గుడివాడ గ్రామానికి, రూ.75 లక్షలతో అయితంపూడి గ్రామానికి బీటీరోడ్డును రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. మర్రివలస –గొల్లలపాలెం రోడ్డును రూ.60 లక్షలతో పూర్తి చేస్తామన్నారు. రావికమతం నుంచి తోటకూరపాలెం వరకూ ఆర్‌అండ్‌బీ రోడ్డుకు వారం రోజులలోనే నిధులు మంజూరు చేయించి పనులు చేయిస్తామన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో ప్రజల ఆదరాభిమానాలు పొంది వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో గతంలో మాదిరి సీట్లు సొంతం చేసుకుంటామని సవాల్ విసిరారు.

టీడీపీ బస్సు యాత్రకు స్పందన కరువు

- జనం రాక మొక్కుబడిగా సాగిన వైనం
- గవిరెడ్డి, పీవీజీ ఎడమొఖం పెడమొఖం

మాడుగుల/చీడికాడ/దేవరాపల్లి: భవిష్యత్ గ్యారెంటీ పేరుతో మాడుగుల నియోజకవర్గంలో సోమవారం టీడీపీ నిర్వహించిన బస్సు యాత్రకు స్పందన కరువైంది. అరకొరగా హాజరైన జనం మధ్య మొక్కుబడిగా సాగింది. పలు గ్రామాల మీదుగా సాగిన ఈ యాత్ర వైపు ప్రజలు కనీసం కన్నెత్తి చూడలేదు. ఇదే సమయంలో ఇక్కడ నాయకుల్లో వర్గ పోరు మరోమారు బహిర్గతం కావడంతో కార్యకర్తలు అయోమయానికి గురయ్యారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి వర్గీయులు బస్సుయాత్రతో వెళ్లకుండా ఘాట్‌రోడ్, కేజేపురం మీదుగా అడ్డదారుల్లో అప్పలరాజుపురం చేరుకుని ఆయన ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ చీడికాడలోని తన సొంత నివాసంలో ఏర్పాటు చేసిన విందుకు ఆయన వర్గం హాజరైంది. ఈ వర్గ విభేదాలతో కొంతమంది ఎక్కడా భోజనం చేయకుండా వెళ్లిపోయారు. మాడుగుల మండలం ఘాట్‌రోడ్ జంక్షన్ నుంచి ప్రారంభమైన ఈ బస్సు యాత్ర చీడికాడ మీదుగా దేవరాపల్లి చేరుకుంది.


దేవరాపల్లి మండలం కలిగొట్ల వద్ద అరకొరగా జనంతో టీడీపీ బస్సు యాత్ర

అనంతరం కె. కోటపాడు మండలం నుంచి కింతాడ వరకు తూతూమంత్రంగా ముగిసింది. అడుగడుగునా జనాదరణ లేక డీలా పడింది.

దీనిలో భాగంగా ప్రభుత్వాన్ని విమర్శించడానికి మాడుగులలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ఆశించిన స్థాయిలో జనం రాలేదు. ఇక్కడ ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణ, జిల్లా ఇన్‌చార్జి బి. నాగజగదీశ్వరరావు, పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, మాడుగుల పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే రామానాయుడు ఎప్పటి మాదిరిగానే ప్రభుత్వాన్ని విమర్శించారు.

హంతకునికి జీవిత ఖైదు

విశాఖ లీగల్ : స్నేహితుడిని హత్య చేసిన నేరానికి ఓ వ్యక్తికి జీవిత ఖైదు, రూ.20 వేల జరిమానా విధిస్తూ నగరంలోని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి లాలం శ్రీధర్ సోమవారం తీర్పు చెప్పారు. జరిమానా సొమ్ములో రూ.15 వేలు బాధితురాలికి ఇవ్వాలని పేర్కొన్నారు. జరిమానా చెల్లించిన పక్షంలో అదనంగా మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని స్పష్టం చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.వి.ఆర్.మూర్తి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు ఎం.దాలినాయుడు (30) విశాఖ జిల్లా దేవరాపల్లి మండలం కాశీపురం గ్రామానికి చెందినవాడు. వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. ఫిర్యాది ఎస్.రమాదేవి రాంబిల్లి మండలానికి చెందిన అప్పన్నపాలెం గ్రామ నివాసి. రమాదేవి భర్త రామనాయుడు విశాఖ డెయిరీలోని పశు సంవర్థక విభాగంలో పనిచేసేవాడు. దాలి నాయుడు, రామనాయుడు మంచి స్నేహితులు కావడంతో వీరు తరచూ కలుసుకునేవారు. ఈ నేపథ్యంలో రామనాయుడు భార్య రమాదేవితో దాలినాయుడు మాట్లాడడంతో స్నేహితుల మధ్య వివాదం చెలరేగి హత్యకు దారి తీసింది. 2016 డిసెంబరు 2న రామనాయుడు విధులు ముగించుకుని ఇంటికి వస్తుండగా రాత్రి 10:30 సమయంలో దాలి నాయుడు ఘర్షణ పడ్డాడు. ఇదే అదునుగా దాలి నాయుడు ముందుగా తనతో తెచ్చుకున్న కత్తితో బలంగా గాయపరిచాడు. కొంతసేపు ప్రాణంతో ఉన్న రామనాయుడు తన ఇంటి వద్దకు రాగానే మృతి చెందాడు. భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు దేవరపల్లి పోలీసులు నిందితునిపై కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రం దాఖలు చేశారు. అప్పటి పోలీస్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ మురళి కేసు దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

పాడేరు రోడ్డు మార్గంలో బైక్ ప్రమాదం

జి.మాడుగుల : జి.మాడుగుల–పాడేరు రోడ్డు మార్గంలో శివాలయం సమీపంలో బైక్ అదుపు తప్పిన ఘటనలో బైక్ నడుపుతున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలివి. నర్సీపట్నానికి చెందిన రాము తన బైక్‌పై సోమవారం పాడేరు వెళుతుండగా సంతబయలు గ్రామ సమీపంలో శివాలయం వద్ద బైకు అదుపు తప్పడంతో అతని రెండు చేతులు విరిగిపోయాయి. గాయపడిన రామును చికిత్స నిమిత్తం 108 వాహనంలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. రోడ్డు మధ్యలో మూడు చోట్ల గోతుల కారణంగా ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది.


ప్రమాదానికి గురైన రాము

గిరి ప్రదక్షిణలో ప్లాస్టిక్ నిషేధం

దాబాగార్డెన్స్: శ్రీవరహాలక్ష్మీ నరసింహ స్వామి గిరి ప్రదక్షిణలో ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పలు స్వచ్ఛంధ సంస్థలను కోరారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్లో సోమవారం పలు స్వచ్ఛంధ సంస్థలు, ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్‌జీవోస్, ఎస్ఎస్ఎస్, ఎన్‌సీసీ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్లాస్టిక్ నిషేధం అమల్లో ఉన్నందున గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు అందించే ప్రసాదాలు, పానీయాలు ప్లాస్టిక్ కల్గిన వస్తువుల్లో అందించొద్దన్నారు.

నిఘా నీడలో గంగవరం పోర్టు


గంగవరం పోర్టు వద్ద మోహరించిన పోలీసులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు వద్ద సోమవారం పెద్దఎత్తున పోలీసులను మోహరించారు. పోర్టులో పని చేస్తున్న కార్మికులు తమ వేతనాలను పెంచాలని కోరుతూ చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో సుమారు 400 మంది పోలీసులు ఇక్కడ బందోబస్తు నిర్వహించారు. కార్మిక సంఘాల నాయకులు, పోర్టు యాజమాన్య ప్రతినిధులు కార్మికుల వేతనాల సమస్యపై కలెక్టర్‌తో కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం చర్చలు జరగనున్న నేపథ్యంలో గంగవరం పోర్టు ఆవరణలో భారీగా పోలీసులను మోహరించారు. గంగవరం పోర్టులో పనిచేస్తున్న కార్మికులు శనివారం పెద్దఎత్తున ఆందోళనకు దిగడంతో పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఉద్రికత్తతకు దారితీసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 8 మంది కార్మికులను అదుపులోకి తీసుకోవడం, ఈ నేపథ్యంలో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు కార్మికులకు మద్దతు ప్రకటించడంతో పోర్టు వద్ద మరోసారి వాతావరణం వేడెక్కే పరిస్థితి నెలకొంది. పోర్టులో పని చేస్తున్న 500 మంది నిర్వాసిత కార్మికులకు సోమవారం సంస్థ సెలవు ప్రకటించడంతో వారంతా ఎక్కడ ఆందోళనకు దిగుతారమోనని ముందుస్తుగా ఇక్కడ పోలీసులను మోహరించారు. వేతనాల పెంపు, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలనే డిమాండ్ నేపథ్యంలో న్యూపోర్టు, స్టీల్‌ప్లాంట్, మల్కాపురం, దువ్వాడ పోలీసులతో పాటు స్పెషల్ ప్రొటెక్షన్ పోలీసు బలగాలను ఇక్కడ మోహరించారు. దీని కారణంగా గంగవరం పోర్టు ప్రాంతం మొత్తం పోలీసులు నీడలోకి వెళ్లిపోయింది. ఇదిలావుండగా కలెక్టర్‌తో చర్చలు మంగళవారానికి వాయిదా పడ్డాయి.

'సిరి' సిత్రాలు చూడరో..

చిత్రకళలో అతనొక ప్రత్యేకం. అందరూ రంగులు వాడితే ఆయన రాగులు, అరికలు, సజ్జలు, గంట్లు, సామలు వినియోగిస్తారు..

వీటితోనే అద్భుత చిత్రాలకు జీవం పోస్తున్నారు. ఏ రంగంలోనైనా ప్రత్యేకత చాటుకోకపోతే ఉనికి ఉండదు. అందుకే మోకా విజయ్ కుమార్ తనకంటూ ఓ బ్రాండ్ సృష్టించుకున్నారు. వివిధ దేశాల నుంచి వచ్చిన అతిథుల మనసు దోచుకున్నారు. హైదరాబాద్‌లో జీ 20 సదస్సులో అతిథులకు చిత్రాలు బహూకరించిన అనంతరం విజయకుమార్ విశాఖకు చేరుకున్నారు. ఆయన కళానైపుణ్యంపై ప్రత్యేక కథనం..

–ఏయూక్యాంపస్

- తృణధాన్యాలతో ప్రముఖుల చిత్రాలు
- విదేశాలకు విశాఖ చిత్రకారుడు విజయ్ కుమార్ ప్రతిభ
- ఇప్పటి వరకు చిరుధాన్యాలతో 60 చిత్రాల రూపకల్పన


తాను తీర్చిదిద్దిన తృణధాన్యాల చిత్రాలతో విజయ్ కుమార్

తృణధాన్యాలతో ప్రముఖుల చిత్రాలను అలవోకగా తీర్చిదిద్దుతున్నారు విశాఖకు చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్. ఈ సంవత్సరాన్ని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా చిరుధాన్యాలకు అంతటి ప్రాముఖ్యత లభిస్తోంది. దీనిని సాధనంగా చేసుకుని విశాఖ నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ తన ప్రతిభకు కొత్తదనాన్ని జోడించారు. సమాజంలో చిరుధాన్యాలపై అవగాహన కల్పించే విధంగా తన కళకు కాస్త కొత్తదనాన్ని జోడించారు. నేడు జాతీయ స్థాయిలో విజయ్ కుమార్ తీర్చిదిద్దిన చిత్రాలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో జరిగిన జీ 20 సదస్సుల్లో భాగంగా 38 దేశాలకు చెందిన వ్యవసాయ శాఖ మంత్రుల చిత్రపటాలను తయారు చేసి మంత్రులకు, వారి అధికారులకు బహూకరించారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌కు సైతం ఆయన చిత్రపటాన్ని సిరిధాన్యాలతో తయారు చేసి విజయ్ కుమార్ స్వయంగా బహూకరించారు. హైదరాబాద్‌లో జీ20 సదస్సులో అతిథులకు చిత్రాలు బహూకరించిన అనంతరం విజయకుమార్ విశాఖ చేరుకున్నారు.

రైల్వేలో ఉద్యోగం చేస్తూ..

విజయ్ కుమార్ రైల్వేలో గ్రేడ్ 1 ఉద్యోగిగా పనిచేస్తున్నారు. చిన్నతనం నుంచి చిత్రకళపై ఉన్న ఆసక్తి చిత్రకారుడిగా మార్చింది. రెండున్నర దశాబ్దాలుగా రైల్వేలో పనిచేస్తూనే చిత్రకళపై ఆసక్తి ఉన్న చిన్నారులకు సైతం శిక్షణ ఇస్తున్నారు. పెన్సిల్, కలర్ ఆర్ట్ వేయడంలో విజయ్ కుమార్ నిష్ణాతుడు.

అంతర్జాతీయ స్థాయికి భారతీయ కళ

భారతీయ కళావైభవాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీసుకువెళ్లిన విజయ్ కుమార్ ఇప్పటి వరకు 60కి పైగా జాతీయ, అంతర్జాతీయ ప్రముఖుల చిత్రపటాలను కేవలం చిరుధాన్యాలను ఉపయోగించి, ఎటువంటి రంగులు వాడకుండా తయారు చేయడం విశేషం. ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులతో పాటు ప్రధాని చిత్రపటాలను సైతం వీటిలో ఉన్నాయి.

ఒక్కో చిత్రానికి నాలుగు రోజులు

ఒక్కో చిత్రానికి దాదాపు నాలుగు రోజుల పడుతుంది. ప్రధానంగా రాగులు, అరికలు, సజ్జలు, గంట్లు, సామలు వినియోగిస్తున్నారు. జర్మనీలో తయారయ్యే కాన్సన్ వాటర్ కలర్ షీట్‌పై ముందుగా పెన్సిల్‌తో అవసరమైన చిత్రానికి అవుట్‌లైన్ గీసుకుంటారు. అనంతరం దీనిపై ఫొటోకు అవసరమైన విధంగా సజ్జలు, రాగులు, అరికలు, సామలు, గంట్లు వంటి సిరిధాన్యాలను ఎంతో జాగ్రత్తగా అతికిస్తూ చిత్రాన్ని తీర్చిదిద్దుతారు. అనంతరం పెస్ట్ కంట్రోల్ చేసి, గాలి చొరబడకుండా ప్రత్యేకంగా ఫ్రేమ్ కట్టిస్తారు.

జీ–20 సదస్సుల్లో ప్రత్యేక ఆకర్షణగా..

విశాఖ వేదికగా జరిగిన ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో సైతం ప్రముఖుల చిత్రాలను సిరిధాన్యాలతో తయారు చేసి బహూకరించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ (హైదరాబాద్) నిపుణులు ఈ చిత్రాలను పరిశీలించి, విజయ్ కుమార్ కృషిని ప్రత్యేకంగా అభినందించారు. సిరిధాన్యాలకు ప్రాచుర్యం కల్పించే విధంగా విజయ్ కుమార్ చేస్తున్న ప్రయత్నాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. తృణధాన్యాలతో వందకు పైగా చిత్రాలను తయారు చేసి గిన్నిస్‌రికార్డు సాధించడమే లక్ష్యమని విజయ్ కుమార్ తెలిపారు.

అదృశ్యమైన మహిళ మృతి


పొలం బావిలో తేలుతున్న మచ్చమ్మ మృతదేహం

చీడికాడ : కనిపించకుండా పోయిన మహిళ మృతి చెందినట్టు ఏఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. వివరాలివి. మండలంలోని తునివలసకు చెందిన గంట్ల మచ్చమ్మ(45) శనివారం ఉదయం నుంచి కనిపించకుండా పోయిందని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు జరుపుతుండగా సోమవారం ఉదయం తునివలస గ్రామ సమీపంలో గల పాతాళం వారి బావిలో మహిళ మృతదేహం ఉన్నట్టు సమాచారం అందింది. అక్కడకు వెళ్లి పరిశీలించగా మృతురాలు తప్పిపోయిన మచ్చమ్మగా గుర్తించామన్నారు. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్టు ఏఎస్ఐ చెప్పారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

కశింకోట : కశింకోటలోని సత్తెమ్మ కాలనీ వద్ద ఏలేరు కాలువలో సోమవారం గుర్తు తెలియని సుమారు 45 ఏళ్ల మహిళ మృతదేహాన్ని కనుగొన్నట్టు ఏఎస్ఐ టి.శ్రీనివాసరావు తెలిపారు. ఎగువ ప్రాంతం నుంచి కొట్టుకు వచ్చి ఇక్కడ నీటిపై తేలుతూ చిక్కుపడడంతో స్థానికులు గుర్తించి సమాచారం అందించారన్నారు. దీంతో వీఆర్వో దరిమిరెడ్డి ఉదయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని వెలికి తీసి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామని ఎస్ఐ తెలిపారు. మృతురాలు నీలి రంగు చీర, ఆకుపచ్చ రంగు జాకెట్ ధరించి ఉందని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్లుప్తంగా

డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థులు

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి కేంద్రంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక నెహ్రూచౌక్‌లో మానవహారం నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరమణ మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండేలా డిగ్రీ కళాశాలను పూర్తి స్థాయి సిబ్బందితో ఏర్పాటు చేయాలన్నారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. సకాలంలో పాఠ్యపుస్తకాలను అందించి, విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సుల్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పోలవరం కోసం మహాపాదయాత్ర



పోలవరం నిర్వాసితుల కోసం చందాలు వసూలు చేస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లిటౌన్ : పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసితులకు చట్టప్రకారం తక్షణమే పునరావాసం, పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో జూలై 4వ తేదీ వరకూ పోలవరం పోరుకేక పేరుతో మహా పాదయాత్రలో భాగంగా నిధి వసూళ్లను సోమవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారుగా 400 కిలోమీటర్లు మహా పాదయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తి అయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా రాష్ట్ర ప్రజలందరికీ మేలు జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్.శంకరరావు, ఎ.బాలకృష్ణ, గంటా శ్రీరామ్, బి.ఉమామహేశ్వరరావు, డి.శ్రీనివాసరావు, కె.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 127 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	---	---
మూడోరకం	3,860	4,000

అనకాపల్లి సినిమాలు

మనుచరిత్ర	: రాజా
టక్కర్	: సత్యనారాయణ స్క్రీన్-1
మేమ్ ఫేమస్	: సత్యనారాయణ స్క్రీన్-2
1920	: షిర్డిసాయి
అశ్వనీస్	: పర్తిసాయి
భీమదేవరపల్లి బ్రాంచ్ (3 ఆటలు)	
ది ఫ్లాష్ (మ్యాట్నీ)	: వెంకటేశ్వర
యూనివర్సిటీ	: శ్రీసత్య
ఆదిపురుష్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 31 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-7 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 425 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 397 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

మంత్రి అమర్‌నాథ్ చొరవతో బాలికలకు వాహనయోగం

జగనన్న ప్రభుత్వంలో సర్కారీ బడులకు మహర్దశ వచ్చింది. ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థులు కార్పొరేట్ విద్యార్థులను మించి రాణిస్తున్నారు. వారిలో ఆత్మవిశ్వాసాన్ని, ఆనందాన్ని మరింతగా పెంచేందుకు వచ్చే ప్రతి అవకాశాన్నీ ప్రభుత్వ పెద్దలు వినియోగించుకుంటున్నారు. అందులో భాగంగానే మంత్రి అమర్‌నాథ్ చొరవ చూపారు. అరబిందో యాజమాన్యంతో మాట్లాడి అనకాపల్లి నియోజకవర్గంలోని ప్రభుత్వ హైస్కూళ్లలో చదువుతున్న విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ చేయనున్నారు.





పంపిణీకి సిద్ధంగా సైకిళ్లు (ఇన్‌సెట్) సైకిల్ బిగిస్తున్న వర్కర్

- 2,500 సైకిళ్ల పంపిణీకి అరబిందో చర్యలు
- 31 ప్రభుత్వ హైస్కూళ్లలోని బాలికలకు లబ్ధి

అనకాపల్లిటౌన్ : మన సంకల్పం మంచిదైతే.. ప్రకృతి శక్తులన్నీ కలిసి మనల్ని ముందుకు నడిపిస్తాయంటారు. బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదివే పాఠశాలలపై ప్రభుత్వం పెడుతున్న ప్రత్యేక దృష్టి సత్ఫలితాలిస్తోంది. ప్రైవేట్ కంపెనీలు సైతం ఆ మహా యజ్ఞంలో ఉడతాభక్తిగా తమ వంతు సాయం చేసేందుకు ముందుకొస్తున్నాయి. సర్కారీ స్కూళ్లలో ఇప్పటికే కార్పొరేట్ స్థాయి వసతుల్ని ప్రభుత్వం సమకూర్చింది. దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లేలా కొన్ని పరిశ్రమలు సహకారం అందిస్తున్నాయి. అందుకు తాజా ఉదాహరణే అనకాపల్లి నియోజకవర్గం పరిధిలోని 31 ప్రభుత్వ స్కూళ్లలో 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థినులకు సైకిళ్లను అందించేందుకు అరబిందో యాజమాన్యం ముందుకు రావడం.

మంత్రి అమర్‌నాథ్ చొరవ

రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదేశాల మేరకు అరబిందో ఫార్మా యాజమాన్యం నియోజకవర్గంలో 9, 10 తరగతులు చదువుతున్న బాలికలకు సైకిళ్లు పంపిణీ చేయడానికి అంగీకరించింది. బలహీనవర్గాల బాలికలకు కొంత చేదోడు అందించినట్లయితే వారు అతిసులువుగా ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని సంస్థ ప్రతినిధుల మాట. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో కూడా నియోజకవర్గంలో బాలికలదే పైచేయి. దీంతో మంత్రి అడిగిందే తడవుగా.. వారికి తమ వంతుగా సాయం చేసేందుకు పరిశ్రమ అంగీకరించింది.

31 హైస్కూళ్లలో 2,500 మందికి లబ్ధి

అనకాపల్లి పట్టణం, మండలం పరిధిలో 18 హైస్కూళ్లున్నాయి. ఇదులో జీవీఎంసీ పరిధిలో 6 మున్సిపల్ హైస్కూళ్లు, మండల పరిధిలో 11 జెడ్పీ హైస్కూళ్లు, ఒక ఎయిడెడ్ స్కూల్ ఉన్నాయి. వీటికి తోడు కశింకోట మండలంలో 13 హైస్కూళ్లున్నాయి. మొత్తం 31 హైస్కూళ్లలో 9, 10వ తరగతులు చదువుతున్న బాలికలు సుమారు 2,500 మంది ఉన్నారు. వీరికి అరబిందో సంస్థ రూ.కోటీ 50 లక్షల విలువైన సైకిళ్లను ఉచితంగా అందించేందుకు ముందుకు వచ్చింది.

జీవీఎంసీ పెద్ద హైస్కూల్లోనే అసెంబ్లింగ్

పట్టణ పరిధిలోని జీవీఎంసీ పెద్ద హైస్కూల్‌కు పక్షం రోజుల క్రితం సైకిళ్ల విడిభాగాలు చేరుకున్నాయి. వీటిని గత పది రోజులుగా 10 మంది వర్కర్ల సాయంతో సైకిళ్లగా తుదిరూపునిచ్చే పనిలో ఉన్నారు. సోమవారానికి 638 సైకిళ్లను పూర్తి స్థాయిలో అమర్చారు. మిగిలిన సైకిళ్ల విడిభాగాలను అసెంబ్లింగ్ చేసే పనిలో వర్కర్లు బిజీగా ఉన్నారు. అవసరమైన మేరకు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి, మరో 15రోజుల్లో మొత్తం సైకిళ్లను సిద్ధం చేసి విద్యాశాఖాధికారులకు అందించేందుకు చర్యలు చేపడుతున్నారు.

త్వరగా స్కూల్‌కి చేరుకోవచ్చు



జీవీఎంసీ పెద్దహైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నాను. రోజూ మండలంలోని మూలపేట గ్రామం నుంచి పట్టణంలో ఉన్న స్కూల్‌కి రావాలి. రానూపోనూ నాలుగు కిలోమీటర్లు. నడుచుకుంటూ, ఎవరైనా వస్తే లిఫ్ట్ అడుగుతూ స్కూల్‌కి వస్తున్నా. సైకిల్ ఇస్తే స్కూల్‌కు త్వరగా చేరుకోవచ్చు.

– పి.కీర్తన, 9వ తరగతి, మూలపేట

సైకిల్ కోసం ఎదురు చూస్తున్నా



తుమ్మపాల నుంచి పట్టణంలో హైస్కూల్‌కు నిత్యం బస్సులోనే రాకపోకలు. ఒక్కోసారి బస్సులు ఖాళీలేక చాలా ఇబ్బందిగా ప్రయాణించాల్సి వస్తోంది. సైకిల్‌ను ఉచితంగా ఇస్తారని తెలిసింది. చాలా ఆనందంగా ఉంది. మా స్కూల్లో చదువుతున్న మాకు ఎప్పుడెప్పుడు సైకిల్ ఇస్తారా? అని చూస్తున్నా.

– కరిష్మా, 10వ తరగతి, తుమ్మపాల

పక్షం రోజుల్లో పంపిణీ



పిల్లలకు అవసరమైన సైకిళ్ల విడి భాగాలు ఎప్పుడో వచ్చేశాయి. వీటిని అసెంబ్లింగ్ చేసే పనిలో ఉన్నాం. మరో 15 రోజుల్లో విద్యార్థినులకు సైకిళ్లను అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. మంత్రి అమర్‌నాథ్ పిలుపుతో అరబిందో సంస్థ సహకారంతో విద్యార్థినులకు సైకిళ్లను అందిస్తున్నాం.

– కె.వి.నరసింహారావు, ఎంపీడీవో, అనకాపల్లి

‘డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేద్దాం’



మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ర్యాలీలో డాక్టర్ వాణీజగదీశ్వరి, వైద్య సిబ్బంది

తుమ్మపాల : స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఇందిరా నగర్‌లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న పలువురి రోగులకు వైద్యురాలు వాణీజగదీశ్వరి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. అవసరమైన వారికి తగిన సూచనలు చేసి పరీక్షలు జరిపారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంలో భాగంగా డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ వినియోగం, రవాణా వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ప్రియదర్శిని, ఈశ్వరరావు, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

‘జగనన్న ఆణిముత్యాలు’కు సత్కారం



తాళ్లపాలెం హైస్కూల్లో విద్యార్థులకు సత్కారం

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం హైస్కూల్లో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించి టెన్త్‌లో ఈ ఏడాది అత్యధిక మార్కులు వచ్చిన 8 మంది విద్యార్థులను సత్కరించారు. నగదు, పతకం, ప్రశంసా పత్రాలను, వ్యక్తిగతంగా బహుమతులను అందించారు. అనంతరం నాడు–నేడు కార్యక్రమంలో పాఠశాలలో అభివృద్ధిపై సమావేశం నిర్వహించి చర్చించారు. హెచ్ఎం వై.విజయలక్ష్మి సుమన్, ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, విద్యా కమిటీ చైర్మన్ గుమ్మడి గోవింద, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రామావతారంలో జగన్నాథుడు



కశింకోట : కశింకోటలోని దేవదాయ శాఖకు చెందిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో జగన్నాథస్వామి ఉత్సవాలు వారం రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం స్వామివారు శ్రీరాముని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీమహావిష్ణువు దశావతారాల్లో ఏడవ అవతారంగా శ్రీరాముని రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విష్ణు సహస్ర నామార్చన, భక్తుల గోత్ర నామాలతో పూజలు ప్రసాద వితరణ చేశారు. ఆలయయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, రేజేటి మారుతి, రేజేటి రామచరణాచార్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిపారు. ఈ సందర్భంగా భక్తిపాటలతో నిర్వహించిన ఆర్కెస్ట్రా భక్తుల్ని అలరించింది.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



కశింకోట శివాలయంలో శివలింగానికి ప్రత్యేక అలంకరణ

కశింకోట : స్థానిక పురాతన శివాలయంలో సోమవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివ లింగాన్ని పువ్వులు, బిల్వ పత్రాలు, చందనం, విభూది తదితర పూజాద్రవ్యాలతో అలంకరించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు వి.శంకరం, వి.చిదంబరం, వి.కృష్ణల ఆధ్వర్యంలో పూజాకార్యక్రమం జరిగింది. అనంతరం దాత సహాయంతో అన్న సమారాధన నిర్వహించారు. కస్పావీధిలో ఉన్న సాంబశివుని ఆలయంలో కూడా పూజారి వెయ్యిదకంల ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి.

‘జగనన్న సురక్ష’పై అవగాహన

అనకాపల్లి రూరల్ : మండలంలోని సత్యనారాయణపురం పంచాయతీలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ వలంటీర్లు సకాలంలో సర్వే పూర్తి చేయాలని, జగనన్న సురక్ష వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు విడమరచి చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కారమవుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్షను విజయవంతం చేయాలని గ్రామస్థాయి యంత్రాంగాన్ని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పలకా భాగ్యలక్ష్మి, పలకా సత్తిబాబు, ఎంపీటీసీ–1 జోగా నాగమణి, జోగా నాగేశ్వరరావు, ఎంపీటీసీ–2 కర్రి మజ్జి అలివేణి, వైఎస్సార్‌సీపీ గ్రామ ఉపాధ్యక్షుడు రావి కిశోర్, ఉప సర్పంచ్ అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శి శైలజ, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే

కశింకోట : మండలంలోని జి.భీమవరంలో ‘జగనన్న సురక్ష’ కార్యక్రమంలో భాగంగా సోమవారం సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందనివారిని, ధ్రువీకరణ పత్రాలు అవసరమైన వారిని ఆరా తీశారు. ప్రజలకు అందించే సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి చిన్నోడు, సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లపాలెం సంత కిటకిట

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం మేకలు, గొర్రెల అమ్మకాలు జోరుగా సాగాయి. ఈ నెల 29న బక్రీద్ పండగ కావడంతో వీటికి గిరాకీ ఏర్పడింది. సుమారు 40 కిలోల బరువున్న మేకకు రూ.35 వేల ధర పలికింది. ఇక్కడి వారపు సంతకు ఉమ్మడి విశాఖతోపాటు ఉభయ గోదావరి జిల్లాల నుంచి గొర్రెలు, మేకల పెంపకందారులు, వ్యాపారులు వాటిని వ్యాన్లు, ఆటోలపై సంతకి తెచ్చారు. దీంతో సంత కిక్కిరిసింది. బక్రీద్ ఇదే వారంలో ఉండటంతో వీటికి డిమాండ్ పెరిగింది.

గిజిగాడా నీకు దీర్ఘాయువౌ!



అందమున నీకు నీడగు నందగాడు
గృహవినిర్మాణమున నిన్ను గెలుచువాడు
వైభవంబున బోలు దేవతల ఱేడు
లేడురా గి జిగా! మొనగాడ వోయి

అని కీర్తించిన కవికోకిల గుర్రం జాషువా ఈ చిత్రాన్ని చూస్తే మరోసారి అచ్చెరువు నొందునేమో..! కశింకోట వద్ద శారదానది అవతల ఉన్న పొలాల్లో విద్యుత్ తీగలను ఆసరాగా చేసుకుని గిజిగాళ్లు(పిచ్చుకలు) అల్లుకున్న అందమైన గూళ్లు. చుట్టూ పంట భూములు, పచ్చని చెరకు తోటల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో పీచు, గడ్డి సహాయంతో 15కు పైగా గూళ్లు విద్యుత్ తీగలకు వేలాడుతున్నాయి. వాటిలో ఉల్లాసంగా, ఉత్సాహంగా పిచ్చుకలు జీవనం సాగిస్తున్నాయి. ఆ దిశగా రాకపోకలు సాగించేవారు ఆగి మరీ తమ సెల్‌ఫోన్లలో వాటిని భద్రపరచుకుంటున్నారు.

– సాక్షి, కశింకోట

సీఎం జగన్‌ది చేతల ప్రభుత్వం



సీసీ డ్రైనేజీ నిర్మాణ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- ప్రజల ఆదరణ చూడలేకే విపక్షాల ఆరోపణలు
- ‘గడప గడపకు మన ప్రభుత్వం’లో మంత్రి అమర్‌నాథ్



కాపుశెట్టివానిపాలెంలో వృద్ధురాలి సమస్యను వింటున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని నవరత్నాల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని రేబాక పంచాయతీ కాపుశెట్టివానిపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని కుటుంబాల వారీగా గణాంకాలతో సహా వివరించారు. వారి సమస్యల్ని తెలుసుకుని, వాటి సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. గ్రామంలో కొంతమంది సాంకేతిక పరమైన కారణాలతో తమకు ప్రభుత్వ పథకాలు అందలేదని, గ్రామాల్లో డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని విన్నవించారు. దీంతో జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హుల పేర్లను నమోదు చేసి, వారికి సంక్షేమ పథకాలు అందించాల్సిందిగా అధికారులకు మంత్రి ఆదేశాలు జారీచేశారు. వచ్చే నెల 5వ తేదీలోపు అర్హులందరినీ లబ్ధిదారుల జాబితాలో చేర్చాలన్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న రోగులను కలుసుకుని వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వారికి అవసరమైన వైద్య సేవల్ని, ప్రభుత్వ నిధులతో చేయిస్తామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు మరింతగా చేరువయిందని, ఏ లక్ష్యంతో నవరత్నాలను ప్రవేశపెట్టారో అవన్నీ శాతశాతం అట్టడుగు ప్రజలకు అందేలా చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ప్రజల అభిమానాన్ని పొందిందని, అది తట్టుకోలేక ప్రతిపక్షాలు బెంబేలెత్తిపోతున్నాయని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాలన్నీ ఏకమై జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించాలని చూసినా, ప్రజలంతా ఏకతాటిపై మళ్లీ సీఎంగా జగన్‌ను అధికార పీఠంపై నిలిపేందుకు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో రూ.12 లక్షల నిధులతో నిర్మించిన డ్రైనేజీని శిలాఫలకాన్ని ఆవిష్కరించి మంత్రి ప్రారంభించారు. మంత్రికి అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పూలుచల్లి, హారతులు పట్టి వెంట నడిచారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, గ్రామ సర్పంచ్ మార్టూరు సన్యాసమ్మ, ఎంపీటీసీ మంత్రి సంతోష్, పార్టీ నేతలు బంటు ఏడుకొండలు, కాపుశెట్టి రామకృష్ణ, కోట సత్తిబాబు, ప్రభుత్వ విభాగాల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు అందిస్తున్న కొణతాల భాస్కర్

అనకాపల్లిటౌన్ : నాణ్యమైన వరి విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందిస్తోందని వైఎస్సార్‌సీపీ 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్ తెలిపారు. జీవీఎంసీ విలీన గ్రామాలైన గొర్లివానిపాలెం, రాజుపాలెం, ఎరుకువానిపాలెం గ్రామాల(26వ సచివాలయం) పరిధి రైతులకు సోమవారం విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతే రాజు అనే సిద్ధాంతాన్ని నమ్మిన వ్యక్తి అని కొనియాడారు. అన్నంపెట్టే రైతును కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తమ ప్రభుత్వంలో సచివాలయాల పరిధిలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామని, రైతులు నేరుగా అధికారులకు సంప్రదించి మెరుగైన సాగు పద్ధతులు, సమస్యల పరిష్కారం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విభాగం అధికారులు గణేష్, అజయ్, వైఎస్సార్‌సీపీ నాయకులు సీహెచ్ అప్పలనాయుడు, నాగిరెడ్డి రాంబాబు, అప్పలనాయుడు, రాజు, రమేష్, విల్లూరి శేఖర్, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ రేపు

కశింకోట : స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఈ నెల 28న మధ్యాహ్నం 3 గంటలకు ఖరీఫ్ వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీపీ కలగా లక్ష్మి, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తప్పనిసరిగా పాల్గొనాల్సిందిగా కోరారు.

ఏలేరు కాలువలో మహిళ మృతదేహం

కశింకోట: కశింకోటలోని సత్తెమ్మ కాలనీ వద్ద ఏలేరు కాలువలో సోమవారం గుర్తుతెలియని సుమారు 50 ఏళ్ల మహిళ మృతదేహాన్ని కనుగొన్నట్టు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఎగువ ప్రాంతం నుంచి కొట్టుకు వచ్చి ఇక్కడ చిక్కుపడటంతో స్థానికులు సమాచారం అందించారన్నారు. దీంతో సంఘటన స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని వెలికి తీసి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కౌలు రైతుల సంక్షేమానికి కృషి చేయాలి



కౌలు రైతులకు న్యాయం చేయాలంటూ నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

తుమ్మపాల : కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రైతు భరోసా మంజూరు చేసి, పంటల సాగుకు రుణాలు అందించి, వారి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం నాయకులు నిరసన తెలిపారు. పట్టణంలోని కొడుగంటి గోవిందరావు భవనంలో సోమవారం రైతు సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జమలయ్య మాట్లాడుతూ కౌలు రైతులకు పంటనష్టం వాటిల్లడంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ప్రభుత్వం కౌలు రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల సమస్యలపై ఈ నెల 26 నుంచి 30 వరకు ప్రచారం చేస్తున్నామన్నారు. వచ్చే నెల 3న సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. 10, 11 తేదీల్లో రీలే నిరాహారదీక్షలు చేయనున్నట్టు తెలిపారు. అంతకు ముందు ర్యాలీగా నాలుగు రోడ్ల జంక్షన్‌కు చేరుకుని, నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రాజాన దొరబాబు, రావు జగ్గారావు, గొల్ల గురుబాబు, సన్యాశిరావు, మేక సత్యనారాయణ పాల్గొన్నారు.